సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ సురేష్



అనాథ శవాన్ని దగ్గరుండి తరలిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. పీవీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న అతను అనాథ శవానికి అంత్యక్రియలు స్వయంగా నిర్వహించారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సేవా మార్గం వద్ద భిక్షాటన చేసుకునే ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం మరణించారు. విషయాన్ని మల్కాపురం పోలీసుల ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ పి.వి.సురేష్ పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను తీసుకు వెళ్లి, అనాథ శవానికి దగ్గరుండి దహన కార్యక్రమాలను పూర్తి చేయించారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కార్పొరేటర్ పి.వి.సురేష్‌ను అభినందించారు.

భారీ అన్నసమారాధన



62వ వార్డులో మండపం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ నిర్వాహకులు లక్ష్మణరావును శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎన్టీఆర్ కాలనీలో దుర్గాదేవిని ప్రతిష్టించి ఉత్సవాలు జరిపించడం ఐకమత్యానికి, భక్తిభావానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దాడ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అక్టోబర్ 8,9 తేదీల్లో 'స్వాతంత్ర్యానంతర తెలుగు–హిందీ సాహిత్యంలో మహిళా రచయితల సాహిత్య కృషి' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రైటర్స్–జర్నలిస్ట్స్ అసోసియేషన్ భారత్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సులో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు ప్రధాన వక్తలుగా పాల్గొంటారన్నారు. తెలుగు–హిందీ సాహిత్యాల్లో రచయిత్రుల శైలి, రచనా విధానం, వంటి అంశాలపై ప్రసంగిస్తారని కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జె.నిర్మల, ఎస్.దీప్తి, కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్ సెల్ దానంపై అవగాహన

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, బోటనీ విభాగం, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో డాత్రీ–బ్లడ్ స్టెమ్ సెల్ డోనర్ రిజిస్ట్రీ, ఇండియా సహకారంతో రక్త, స్టెమ్ సెల్‌దానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ జన్యు విశ్లేషణ, మూల కణ మార్పిడి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ములగాడ సూర్యనారాయణ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- శుభ్రతకు నోచుకోని మంచినీటి ట్యాంకు
- కుళాయి నీటిలో దోమల లార్వాలు
- ధార తక్కువ రావడంతో అవస్థలు
- సమయం పెంచాలని వేడుకోలు



మంచినీటి కుళాయి నుంచి వస్తున్న దోమల లార్వా

కంచరపాలెం: తాంబూళాలు ఇచ్చాం.. తన్నుకు చావండి అన్న చందంగా మారింది టిడ్కో నివాసుల పరిస్థితి. ఇళ్లు నిర్మించి అర్హులకు అందజేశారు. అయితే మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆయా కాలనీ వాసులు నరక యాతన పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

జోన్–5 పరిధిలోని 56వ వార్డు కంచరపాలెం దరి రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీల్లోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్న తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాజీవ్‌కాలనీ, ముత్యమాంబ కాలనీలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించారు. సుమారు 564 మంది తమ ఇళ్ల పట్టాలు అందుకుని పండగ వాతావరణంలో ఇళ్లలో దిగారు.

పనిచేయని బోర్లు

మంచినీటి బోర్లు సక్రమంగా పనిచేయడం లేదని, వాటర్ ట్యాంక్ శుభ్ర పరచకపోవడంతో నాచు పట్టిన నీటినే వినియోగిస్తున్నామని వాపోతున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన బోరు మోటర్లు వారం రోజులుగా పనిచేయకపోవడంతో వీధిల్లోని చేతిపంపులు, జీవీఎంసీ మంచినీటి కుళాయిల వద్ద నీరు పట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది.

అయితే పట్టాలు అందించిన తర్వాత మౌలిక వసతులైన మంచినీరు, విద్యుత్‌లైట్లు, పారిశుధ్య నిర్వహణ,రోడ్ల కల్పనను అధికారులు పట్టించుకోవడ లేదు. దీంతో నిత్యం అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.



అధ్వానంగా మంచినీటి బోరు పరిసరాలు



కుళాయిల నుంచి చిన్నదార రావడంతో బిందెలతో నిరీక్షణ

తాగునీటిలో దోమల లార్వా

రాజీవ్ కాలనీ టిడ్కో ఇళ్లలో సుమారు 285 మంది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మంచినీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ పూర్తిగా నాచుపట్టి ప్రమాద భరితంగా మారింది. ట్యాంక్‌ను శుభ్రపరకపోవడంతో నాచుపట్టడంతో పాటు దోమల లార్వా, గుడ్లు నీటిపై తేలుతున్నాయి. కుళాయి నీరు పట్టేటప్పుడు నీటి ద్వారా దోమల లార్వాలు వస్తున్నాయని వాపోతున్నారు. బిందెలు, బకెట్లు, బాటిళ్లల్లో పట్టి అధికారులు వచ్చేటప్పుడు చూపించేందుకు భద్రపరిచామని చెబుతున్నారు. శుక్రవారం వచ్చిన సిబ్బందికి చూపించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

స్తంభాలు వేశారు.. లైట్లు మరిచారు

కాలనీల్లో విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ లైట్లు సక్రమంగా అమర్చక పోవడంతో నిత్యం చీకట్లు కమ్ముకుంటున్నాయి. చీకట్లో రాకపోకలు సాగించాలంటే భయాందోళనగా ఉంటుందని, రోడ్లపై మందుబాబు చిందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరతున్నారు.



రాజీవ్ కాలనీలో అధ్వానంగా వాటర్ ట్యాంక్

ఆ డబ్బులు ఎక్కడ?

ప్రతి నెలా కాలనీలో ఇళ్ల వారి నుంచి నిర్వహణ పేరిట రూ.100 వసూలు చేస్తున్నారు. మోటారు పాడైనపుడు మరమ్మతులకు వినియోగిస్తామని చెబుతున్నా... మళ్లీ మరమ్మతులకు డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉందని కాలనీలో మహిళలు వాపోతున్నారు. జీవీఎంసీ మంచి నీటి విభాగం అధికారులు స్పందిస్తే ఇలాంటి సమస్యలు రావని చెబుతున్నారు.

పట్టించుకోవడం లేదు

తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి. తాగే నీటిలో దోమల లార్వా, నాచు వస్తున్నాయి. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆ నీటినే తాగుతున్నాం. ట్యాంకును శుభ్రం చేయాలని మంచినీటి సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. మంచినీటి కుళాయిల సమయం పెంచాలని కోరినా వినిపించుకోవడం లేదు. అపరిశుభ్రంగా ఉన్న నీటిని తాగడంతో మరింత రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పి.లక్ష్మీనర్స, రాజీవ్ కాలనీ

మహాలక్ష్మీ దేవిగా దుర్గమ్మ



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద మహాలక్ష్మి అవతారంలో..



కొత్తపాలెం ఆలయంలో కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గాదేవి



మల్కాపురం గొల్ల వీధిలో మహాలక్ష్మి దేవిగా దుర్గమ్మ

గోపాలపట్నం: నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గోపాలపట్నం శంకరా సినిమా హాల్ వద్ద దుర్గాదేవి మండపం ఆవరణంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, పేదలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. స్థానిక నాయకులు, మండప నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. జయప్రకాష్ నగర్‌లోని దుర్గాదేవి మండపంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

దుర్గాదేవికి విశేష పూజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని దుర్గాదేవి మండపాల్లో కొలువైన దుర్గమ్మ శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఎర్ర తామర పుష్పాలను మాలలుగా వేశారు. ఆకుపచ్చని అరటిపండ్లు, పులిహోర వంటి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు.

- 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో డేరింగ్ అండ్ డ్యాషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200ల కొత్త నోట్లతో మండపాన్ని అలంకరించారు. భవానీ మాలధారులు అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు.
- గొల్ల వీధి వద్ద అల్లరి యూత్ ఆధ్వర్యంలో దుర్గమ్మతల్లికి యాదవ సంఘం ప్రతినిధులు ప్రత్యేక పూజలు జరిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వి'లక్ష'ణంగా దుర్గాదేవి



జయదుర్గాదేవిని రూ.3 లక్షల కరెన్సీతో వి'లక్ష'ణంగా అలంకరించారు. గురుద్వారా కూడలి వద్ద ఉన్న జయ దుర్గ ఆలయంలో అమ్మవారిని, మండపాన్ని రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లతో మాలలుగా, పుష్పాలుగా కూర్చి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. – సీతంపేట



గోపాలపట్నంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సహనానికి పరీక్ష

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ సేవా మార్గంలో ప్రయాణం అంటే వాహనదారులు హడలి పోతున్నారు.ఈ మార్గం పూర్తిగా గుంతల మయం కావడంతో పాటు మార్గానికి ఓ వైపు భూ గర్భ విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు కోసం తవ్విన గోతుల కారణంగా రోడ్డు ఇరుగ్గా మారింది. దీంతో ఇక్కడ నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. శుక్రవారం ఉదయం కూడా వాహనాలు నిలిచిపోవడంతో చోదకులు తమ సహనానికి ఈ మార్గంలో ప్రయాణం పరీక్ష పెట్టినట్టు ఉందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరిత గతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. – మల్కాపురం

ఫోకస్



ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఊరుకోం

మల్కాపురం: బడా బాబులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుందామని చూస్తున్నా.. పాలకులు నోరు మెదపక పోవడంపై సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ సిమెంట్ కంపెనీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూమిని కేటాయించడంపై మండిపడుతూ, ఈ చర్యలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. మల్కాపురం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు సాగిన ర్యాలీలో సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ అదానీ ఆధ్వర్యంలో ప్రస్తుతం నడుస్తున్న గంగవరం పోర్టు నుంచి వస్తున్న కాలుష్యం వల్ల పారిశ్రామిక ప్రాంత వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు అదానీ సంస్థకు పెదగంట్యాడ వద్ద సిమెంట్ కంపెనీ పెట్టుకునేందుకు 20 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం కేటాయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. కూటమి సర్కార్ ఉన్నది పేదల పక్షాన.. లేక బడా బాబుల పక్షాన అని నిలదీశారు. నిరుపేదకు గజం స్థలం ఇల్లు కట్టుకోడానికి ఇవ్వమంటే వంద ప్రశ్నలు వేసే ఈ ప్రభుత్వం.. అదానీ సంస్థకు ధారదత్తంగా 20 ఎకరాల భూమిని కేటాయించడం వెనుక ఎవరి హస్తం ఉందో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ 8న సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై గంట్యాడ వద్ద నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, దీనిని తమ పార్టీ అడ్డుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ఐద్వా ప్రతినిధులు పాల్గొన్నారు.



అదానీ సిమెంట్ కంపెనీ పెట్టొదని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ ఎన్నిక

గోపాలపట్నం: విశాఖ జిల్లా నాయీ బ్రహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగింది. సర్వసభ్య సమావేశంలో పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరవ పైడిరాజు, అధ్యక్షుడిగా కోడూరు గణపతిరావు, కోశాధికారిగా గోవాడ సురేష్, గౌరవ అధ్యక్షుడిగా ముసిడిపల్లి రమణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు తెలిపారు. కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.



అధ్యక్షుడు కోడూరు గణపతిరావు



ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు

దళితులపై అమానుష ఘటనలు బాధాకరం

కంచరపాలెం: కృష్ణా జిల్లా నందిగామలో జరిగిన అమానుష సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన ప్రధాన కార్యాలయంలో నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ నందిగామలో సంచార జాతికి చెందిన ఈగ రాంబాబు అనే యువకుడి మృతదేహాన్ని పూడ్చడానికి ఏడు శ్మశానవాటికలు ఉన్నా.. చోటు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అంతిమ సంస్కారంలో ఆరడుగుల జాగా ఇవ్వకుండా అగ్రకుల వర్గాలన్నీ కలిసి అడ్డుకున్నాయన్నారు. ఆరడుగుల స్థలం ఇవ్వండి.. దహన సంస్కారాలు చేసుకుంటామని పుట్టెడు దుఃఖంలో సంచార జాతికి చెందిన ఆ కుటుంబం అన్ని సామాజిక వర్గాల వారిని కలిసి వేడుకున్నా.. ఏ ఒక్కరూ కనికరించకపోవడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నా కూడా దళితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, గొల్లమాల మీనా, చింతాల మల్లికార్జునరావు, లంక రామారావు, ఆర్.వెంకటూరావు, భైరవమూర్తి, బొత్స అప్పారావు, టి.గణేష్, సుబ్రహ్మణ్యం, ధనాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గొల్లమాల అప్పారావు, దళిత సేన నాయకులు

హెచ్‌ఆర్ విభాగాధిపతికి సత్కారం

ఉక్కునగరం: జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు గ్రహీత, స్టీల్‌ప్లాంట్ ప్లాంట్ పర్సనల్ విభాగాధిపతి ఎన్. భానును శుక్రవారం స్టీల్ ఐఎన్టీయూసీ నాయకులు అభినందించారు. న్యూఢిల్లీలో కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఆయన ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. ఆమె ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

సీజనల్ జ్వరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి గణేష్‌నగర్‌లో జోన్–5 పబ్లిక్ హెల్త్ మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలపై అవగాహన కల్పించారు. బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, ఎస్ఎస్ జనార్దనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

62వ వార్డులో వీధిలైట్ల ఏర్పాటు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్, త్రినాథపురం, గుడివాడ అప్పన్న కాలనీ, ఎస్సార్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తెలుగుదేశం కాలనీ, ప్రకాష్‌నగర్, అచ్చెంనాయుడులోవ, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల ప్రజల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు లైట్లు ఏర్పాటు చేయించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లో సంచరిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై కార్పొరేటర్ లక్ష్మణరావు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీధిలైట్లు మంజూరు చేయించగా.. విద్యుత్ సిబ్బంది కార్పొరేటర్ తెలిపిన ప్రాంతాల్లో వీటిని అమర్చారు. స్థానిక ప్రజలు కార్పొరేటర్ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతా ప్రభాకర్, పెద్దాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గానగర్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి

బార్ అసోసియేషన్ తీర్మానం

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గాజువాక బార్ అసోసియేషన్ తీర్మానించింది. శుక్రవారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని నిర్ణయించారు. ఏడాదిగా ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి నియామకం కోసం ఉన్నత న్యాయస్థానంలో అభ్యర్థించాలని నిర్ణయించినట్టు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్‌కు శాశ్వత భవనం నిర్మాణ అనుమతులపై చర్చించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సభ్యులు సహకరించాలని అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి కోరారు.



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు